# ప్రజాశక్తి

సోమవారం 8 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు


# బ్యాక్టీరియా నిర్ధారణపై శోధన

- ఇప్పటి వరకు వచ్చిన నివేదికలన్నీ సాధారణమే
- ఎయిమ్స్, రాష్ట్ర బృందాల నివేదికలే కీలకం
- రేపు ఐసిఎంఆర్ బృందాలు రాక



ప్రభుత్వం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ఆసాధారణ మరణాలపై మిస్టరీ కొనసాగుతోంది. మృతుల బంధువులు, గ్రామంలో జ్వరాలతో బాధపడే వారి నుంచి సేకరించిన రక్త నమూనాలను చెన్నై ఎస్ఆర్ఎం కళాశాలకు పంపినా సాధారణ నివేదికలే వచ్చాయి. ఈ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా వారికి సంబంధిత వైద్యులు పరీక్షలు చేసి మెలైడియోసిస్ అనే బ్యాక్టీరియా వుందని నిర్ధారించడంతో ఈ వ్యాధుల వల్లే ఎక్కువ మంది చనిపోయినట్టు తొలుత భావించారు. కానీ ఇంత వరకు నిర్వహించిన రక్తపరీక్షల్లో నిర్ధారణ కాలేదు. ఎయిమ్స్‌తో పాటు ఇతర రాష్ట్ర స్థాయిలోని వైద్య బృందాలు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో సెప్టెంబరు 2 నుంచి 7వ తేది వరకు సింథమాటిక్ లక్షణాలు హైరిస్క్ ఉన్న 72 మందికి రక్తనమూనలు పరీక్షలకు పంపగా వీరిలో నలుగురుకు ఇతర బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు గుర్తించామని, 14 మందికి గుర్తించలేదని, మిగిలిన పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని అన్నారు. వీటితో పాటు 41 రకాల పరీక్షలు కోసం 1364 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి షుగర్, బయో కెమిస్ట్రీ, కంప్లీట్ బ్లడ్ కల్చర్ పరీక్షలకు పంపించారు. ఇంకా 374 మందికి రక్తనమూనాల సోమవారం నాటికి సేకరించి పరీక్షలకు పంపుతామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.

గ్రామంలో గత ఐదు నెలల్లో 29 మంది మృతి చెందగా జులైలో 10, ఆగస్టులో 10, సెప్టెంబరులో ఇద్దరు మృతి సంచలనం కలిగించింది. అసాధారణ మరణాలంటే ఒకే నెలలో ఒకే ప్రాంతంలో వెయ్యి మందిలో ఇద్దరి కంటే ఎక్కువ మంది చనిపోతే వెంటనే తగిన అధ్యయనం చేయాల్సి ఉంది. ఈ అంశంలో రెండు నెలలు ఆలస్యంగా అధికార యంత్రాంగం మేల్కొంది. జులైలో 10 మంది మృతి చెందినప్పుడే అధికారులు స్పందించి ఉంటే ఆగస్టు, సెప్టెంబరులో 12 మంది మృతికి అవకాశం ఉండేది కాదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఒక్కొక్కరికి మృతికి ఒక్కో కారణం చెబుతున్నా షుగర్, బిపి, హైపర్ టెన్షన్, గుండెపోటు, వివిధ రకాల అవయవాలు దెబ్బతినడం తదితర కారణాలతో ఎక్కువ మంది చనిపోయారు. కొంత మంది తీవ్ర జ్వరం, ఊపిరి ఆడకపోవడం వల్ల కూడా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. 9 మంది మద్యం అలవాటు ఎక్కువగా ఉండటం, గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ వల్ల కూడా మరణాలు సంభవించాయంటున్నారు. తొమ్మిది మంది ప్రభుత్వ ఆసుపత్రిలోను, 13 మంది ప్రైవేట్ ఆసుపత్రులలోనూ, ఏడుగురు ఇంటి వద్ద మరణించారు. గ్రామంలో 870 గహాలు ఉండగా 2400 మంది జనాభా ఉన్నారు. ఒకే గ్రామంలో రెండు నెలల వ్యవధిలో 22 మంది మృతి చెందడం వల్ల బ్లడ్ కల్చర్ పరీక్షలు చేశారు. అందరికి నెగిటివ్ రిపోర్టులు రావడంతో మోలియోడిసోసిస్ బ్యాక్టీరియా ప్రభావం లేదని నిర్ధారించారు. వాటర్ శాంప్లిల్స్ టెస్టింగ్, కెమికల్ ఎనాలసిస్ రిపోర్ట్ సాధారణంగానే ఉండటంతో బ్యాక్టీరియా సమస్య అని అనుమానించారు. కానీ ఈ అంశం ఇప్పటి వరకు నిర్ధారణకు రాలేదు.

క్వారీ నుంచి కూడా వచ్చే కాలుష్యంతో ప్రజలకు శ్వాస కోశ వ్యాధులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మెలైడియోసిస్ అనే బ్యాక్టీరియా వర్షాలు వచ్చినప్పుడు ఎక్కువగా వస్తుందని ఇదిమట్టిలో కూడా

▶ 2లో

## రెండు జిల్లాల్లో 77 బార్‌లకు లైసెన్సులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మద్యం విక్రయాలకు సంబంధించి తొలి విడతలో గుంటూరు జిల్లాలో 53 మంది బార్ లైసెన్సులు పొందారని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 24 మంది లైసెన్సులు చేశామన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత బార్ పాలసీలో చాలా సదలింపులు ఇచ్చామని, మొత్తం లైసెన్సు ఫీజు 6 వాయిదాలలో చెల్లించవచ్చునని, అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలకు తగ్గించామని తెలిపారు. ఏ వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా వేయొచ్చని, ఎన్ని లైసెన్సులైనా డ్రా తీయడం ద్వారా పొందవచ్చునని తెలిపారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, దానికి అవతల 10 కిలోమీటర్లు చుట్టూ విస్తీర్ణం వరకు, మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, దానికి అవతల 10 కిలోమీటర్లు చుట్టూ విస్తీర్ణంలో ఎక్కడైనా బార్ లైసెన్సు తీసుకొని నడుపుకొనవచ్చునని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో చాలా వరకు ఈ 10 కిలోమీటర్లు చుట్టూ విస్తీర్ణంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. తుళ్లూరు, తాడికొండ, మందడం, వెలగపూడి, ఉద్ధాందరాయుణిపాలెం, మల్కాపురం ప్రాంతాలన్ని మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ యొక్క 10 కిలోమీటర్ల పరిధిలోని ఉన్నాయని, మొదటి విడత లైసెన్సు పొందలేని వారు రెండో విడతతో దరఖాస్తుచేసుకోవాలని పేర్కొన్నారు.

## తల్లులు, శిశువులకు సకాలంలో వ్యాక్సిన్లు

**10 రకాల వ్యాక్సిన్‌లతో 11 రకాల జబ్బులకు దూరం - జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌కుమార్**

8లో



## మళ్లీ తెచ్చుకున్న సాగర్ గేట్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నిండుకుండలా ఉన్న నాగార్జున సాగర్ జలాశయం గేట్లను అధికారులు మరోసారి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు 1,67,35 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా అంతే మొత్తంలో నీటిని ఆదివారం 14 గేట్లను 5 అడుగుల వరకు ఎత్తి కిందకు వదిలారు. కుడి కాల్వకు 9,500 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,454 క్యూసెక్కులు, పవర్ హౌస్‌కు 33,738 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

## శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాటుపడాలి

**జెవివి గుంటూరు జిల్లా మహాసభలో కెఎస్ లక్ష్మణరావు**

- 8 లో

# ప్రత్యేక అవసరాలు గలవారికి వరం.. సత్వర చికిత్స కేంద్రం..



కేంద్రంలో చికిత్స పొందుతున్న చిన్నారి



చిన్నారుల ఆటపాటల కోసం కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు

ప్రజాశక్తి-తెనాలి

జిల్లా సత్వర చికిత్సా కేద్రం..ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఓ వరం. శారీరకంగాకాని, మానసికంగాని వారి సమస్యలను గుర్తించి అందించే సేవలు అపురూపంగా ఉన్నాయి. కార్పొరేట్ వైద్యం జడలు విప్పుకున్న తరుణంలో పేద, మధ్యతరగతి వారు అందుకోలేని స్థాయిలో వైద్య ఖర్చులున్నాయి. పిల్లల్లో మానసిక వైకల్యాన్ని చూస్తూ వదిలిపెట్టలేని తల్లిదండ్రుల కడుపుకోతకు స్వాంతనగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం నిలుస్తోంది. పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వయసుకలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు వెలకట్టలేని వైద్యం అందిస్తున్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో గతేడాది మార్చి నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వారికి ఈ కేంద్రంలో చికిత్స అందుబాటులో ఉంది. వివిధ సమస్యలతో పుట్టిన పిల్లలకు '4 డి' ఫార్ములాలో చికిత్స అందిస్తారు. 4 డి అంటే పుట్టిన పిల్లలో వచ్చే వివిధ రకాల సమస్యలను 4 రకాలుగా విభజించి, వైద్యసేవలిందిస్తున్నారు. వాటిలో ముఖ్యంగా మొదటిది గ్రహణమొర్రి, వెన్నుపూసలో వచ్చే న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్, పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, వినికిడి లోపం. రెండవది విటమిన్ లోపం, విటమిన్ ఎ, విటమిన్ డి, ఐరన్ లోపం, పుట్టుకతో వచ్చే రక్తహీనత, ఇన్‌ఫెక్షన్స్. మూడవదిగా ఎముకల్లో వంకర,

▶ 2లో

### వెంటాడుతున్న సిబ్బంది కొరత

**ఖరీదైన ఆపరేషన్లు ఉచితంగా చేయించాం**



మానసిక శారీకర వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో రోజూ కనీసం 15 మంది ఓపీ ఉటుంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్యసేవలందుతున్నాయి. ప్రధానంగా నెలలు నిండకుండా పుట్టిన చిన్నారికి కంటి సంబంధిత సమస్య గుర్తించి, లేజర్ ట్రీట్‌మెంట్ ద్వారా చూపు వచ్చేలా చేశాం. గుండె సంబంధిత వ్యాధిని గుర్తించిన చిన్నారికి తిరుపతిలో ఖరీదైన ఆపరేషన్ ఉచితంగా చేయించాం. అన్నింటినీ మించి ఓ చిన్నారిలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అవశ్యకతను గుర్తించాం. ఇది అత్యంత ఖరీదైన ఆపరేషన్, పైగా అత్యవసరం కూడా. దీంతో వారు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. దానినీ త్వరలో అధిగమిస్తాం. వివిధ రకాల వైకల్యంతో పుట్టిన పిల్లలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతున్న విషయాన్ని గుర్తించి పేద వర్గాలు దానిని సద్వినియోగం చేసుకోవాలి.

**డాక్టర్ సి.మధుబాబు, పీడియాట్రీషియన్**




## చదువును ఆయుధంగా మార్చుకోవాలి

**ప్రజాశక్తి - గుంటూరు :** పేద విద్యార్థులు చదువును ఆయుధంగా మార్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఈనెల 7వ తేదీన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) ఉచిత శిక్షణ శిబిరాన్ని గుంటూరులోని భాష్యం ఆడిటోరియంలో ఆదివారం పులి శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో విద్యను అభ్యసిస్తుంటే పేదరికం అడ్డుకాబోదని, మానవత లాంటి సంస్థలు ప్రతిభగల విద్యార్థులను ఆదుకుంటాయని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను అందిస్తుందని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ ద్వారా మధ్యలో బడిమానేసే వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు. మానవత కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ ద్వారా 80 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, 2025లో 160 మంది ఎంపిక అయ్యేటట్టు కృషి చేస్తామన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ విజిఎస్ పబ్లికేషన్స్ అధినేత ఎస్.రామారావు రూ.లక్ష విలువ చేసే ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌తో కూడిన 300 పుస్తకాలను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అమెరికాలో ఉన్న ప్రవాసాంధ్రులు ప్రభాకర్ రావు రూ.లక్ష, భాష్యం రామకృష్ణ ఆడిటోరియంను శిక్షణ కోసం ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. విజిఎస్ పబ్లిషర్స్ ప్రచురించిన ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు టి.ధనుంజయరెడ్డి, యు.సాంబశివరావు, పి.విమలకుమారి, టీవీ సాయిరాం పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి - తాడేపల్లి :** స్థానిక సీతానగరం రామకృష్ణ హైస్కూల్ 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల రెండవ ఆత్మీయ సమ్మేళనం ప్రాతూరు రోడ్డులోని ప్రముఖ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిది. నాడు పాఠశాలలో చదివిన, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ దాదాపు 50 మంది ఆనాటి విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచే శారు. ప్రతి సంవత్సరం అందరం కలుసుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకున్నారు. బి.చందు, డి.రామకృష్ణారెడ్డి, సీతారెడ్డి, నాగరాజు, మధు, ఉదయలక్ష్మి, కొండమ్మ, ఉషా పాల్గొన్నారు.

## ఇబ్రహీంకు ముస్లిమ్ యువతరం సత్కారం

**ప్రజాశక్తి - మంగళగిరి :** రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితమైన మహమ్మద్ ఇబ్రహీంను మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్ గుడ్ విల్ ముస్లిమ్ సంక్షేమ కార్యాలయం వద్ద అమెరికాలో ఉంటున్న ముస్లిమ్ యువతరం కన్వీనర్ హాజీ ఎమ్‌డి ఇక్బాల్ అహ్మద్ ఆదేశాల మేరకు ఆదివారం సత్కరించారు. అధ్యక్ష కార్యదర్శులు అక్బర్ ఆలీ, అన్వర్, న్యాయవాది సౌకత్, యువతరం నాయకులు గల్ఫ్ సుభాని, భాషిత్, షేక్ జానీ, రషీద్, రఫీ, ఖాదరి, జిలాని, అన్వర్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఎం.రమేష్ బాబు, టిడిపి నాయకులు జె.శ్రీనివాసరావు, ఆర్.పెద్దబ్బాయి, ఇస్మాయిల్, ఎమ్‌డి రఫీ అండ్ బ్రదర్స్ పాల్గొన్నారు.



# బ్యాక్టీరియా వల్లే మరణాలు : ఎపిసిఎల్‌సి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో వరస మరణాలకు గ్రామంలోని చెరువులో ఉన్న బ్యాక్టీరియాతో కూడిన నీటి వినియోగమే కారణమని ఎపి పౌరహక్కుల సంఘం (ఎపిసిసిఎల్‌సి) బృందం అభిప్రాయపడింది. గ్రామాన్ని ఆదివారం సందర్శించిన బృందం స్థానికులతో మాట్లాడింది. బ్యాక్టీరియాతో కూడిన నీటిని బోరు నీటితో కలిపి ట్యాంకరు ద్వారా సరఫరాచేయడం వల్లే ఎక్కువ మంది మోలియోడిసిస్ బ్యాక్టీరియా బారినపడ్డారని బృందం అభిప్రాయపడింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, జిల్లా అధికారులు మూడు నెలలపాటు గ్రామాన్ని సందర్శించలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ విమర్శించారు. మోలియోడిసిస్ బ్యాక్టీరియా వల్ల ఎక్కువ మంది చనిపోయారని, బాధితుల్లో ఎస్‌సి, బిసిలు, మైనార్టీలే ఎక్కువని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని, కాలుష్యానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రాజారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీరేశలింగం, కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్, సహాయ కార్యదర్శి గోపినాథ్, కార్యవర్గ సభ్యులు నాగూర్ వలి పాల్గొన్నారు.


గ్రామ సమీపంలోని కాలుష్యకారక చెరువును పరిశీలిస్తున్న బృందం

# బడేపురం ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - తాడికొండ**

మండలంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. తాడికొండలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో నేతాజి మాట్లాడుతూ బడేపురంలో గత ప్రభుత్వం కేటాయించిన 786 ప్లాట్లలో గృహ నిర్మాణానికి వీలుగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. మోతడక గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలని, ప్రభుత్వం హామీ మేరకు ఇళ్లులేని వారికి 3 సెంట్ల స్థలమివ్వాలని కోరారు. తాడికొండలో తాగునీటి సమస్య, దోమల వ్యాప్తి ఉందని, చెంచు కాలనీలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. తాడికొండ బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. తాడికొండ, కంతేరు రోడ్డు దెబ్బతిని ప్రయాణం కష్టతరంగా మారిందన్న ఆయన ఎర్రవాగు పై నూతనంగా వంతెన నిర్మించాలని కోరారు. లాం గ్రామంలో కొండవీటి వాగుపై నూతన వంతెన నిర్మించాలన్నారు. కాల్వలు పూడిక తీయించాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు, పరిణామాలపై మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు కె.అజయ్‌కుమార్, మండల కార్యదర్శి సిహెచ్.భాస్కరరావు, నాయకులు బి.భద్రయ్య, ఐ.రామారావు, సరస్వతి, సామ్రాజ్యం, రాజు, ప్రసాద్, డేవిడ్, నాగిరెడ్డి, బుల్లబ్బాయి, జోషి పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

## 'అన్నదాత పోరు' పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాశక్తి - తెనాలి, ప్రత్తిపాడు, మంగళగిరి**

రైతు సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు పోస్టర్లను మంగళగిరిలోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డి.వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆవిష్కరించి మాట్లాడారు. మంగళవారం తెనాలి ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే రైతుపోరు కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. తెనాలిలో పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. దేవిచౌక్ నుండి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రత్తిపాడులోని వైఎస్ విగ్రహం వద్ద 'అన్నదాతపోరు' పోస్టర్‌ను వైసిపి మండల అధ్యక్షులు హనుమంత్ యాదవ్ ఆవిష్కరించారు. రైతులకు అవసరమైన ఎరువులను బ్లాక్ మార్కెట్ ద్వారా పక్కదోవ పట్టిస్తున్న నేపథ్యంలో అన్నదాతలకు అండగా 9న ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తామని హనుమంత్ యాదవ్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వరరెడ్డి, జి.పరమరెడ్డి, వి.ఫ్రాన్సిస్, డి.రామారావు, చెంచురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, మహేంద్ర, గోవింద్‌రెడి జి.శివారెడ్డి పాల్గొన్నారు.

# విశ్వనాథ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలి

**ప్రజాశక్తి - గుంటూరు**

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం యువ సాహితీవేత్తలకు ఒక దిక్సూచి, ప్రేరణ కావాలని వివిఐటి విద్యాసంస్థల ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయం, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో 'విశ్వనాథ పదంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు' నిర్వహించారు. ప్రారంభ సదస్సుకు డాక్టర్ మద్దినేని సింహకౌటిల్యచౌదరి అధ్యక్షత వహించి, ఆధునిక తెలుగు సాహిత్యం పునర్జీవానికి కవిసామ్రాట్ సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారన్నారు. అతిథులుగా కవి సామ్రాట్ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ, విశ్వనాథ సాహిత్య అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయరావు పాల్గొన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైథిలి అధ్యక్షత వహించగా కడిమి చెట్టు నవలపై చీదెళ్ళ వీహెచ్ సూర్యకిరణ్, వీర పూజ నవలపై మాడుగుల ఎన్.వి. సుబ్రహ్మణ్యశర్మ, చందవోలు రాణి నవలపై పాతూరి శ్రీప్రవణ్ చర్చించారు. సాంఘిక నవలల సదస్సుకు కళ్యాణ్ అధ్యక్షత వహించగా విఎన్‌ఎస్ హరిప్రియ, పరీక్ష నవలపై కురుగంటి చిరంజీవి కార్తీక్, కుణాలుని శాపము నవలపై కనకాల రవికుమార్ విశ్లేషించారు. అనంతరం వాసిరెడ్డి విద్యాసాగర్ 'విశ్వనాథ పథంలో యువత' గ్రంథావిష్కరణ చేశారు. కార్యక్రమంలో రావెల సాంబశివ రావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్, సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.


గ్రంథావిష్కరణలో పాల్గొన్న వాసిరెడ్డి విద్యాసాగర్, తదితరులు

## ప్రత్యేక అవసరాలు గలవారికి వరం.. సత్వర చికిత్స కేంద్రం..

(మొదటి పేజీ తరువాయి)

నడుము, కాళ్ల వంకరతో పుట్టడం. నాల్గవదిగా ఆటిజం.. బ్రెయిన్ డ్యామేజ్, పుట్టినపుడు పిల్లలు ఏడవకపోవటం, ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవటం, హైపర్ యాక్టివ్‌గా ఉండటం వంటి సమస్యలు. ఇలా ఫోర్ డి ఫార్ములాలో పిల్లలకు చికిత్స అందించటమే జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో రాష్ట్రీయబాల స్వాస్థ్య కార్యక్రమం.

జిల్లా వైద్యశాలలో ఉన్న పిల్లల విభాగంలో సాధారణమైన వ్యాధులకు చికిత్స అందిస్తారు. వారిలో ఏవైనా మానసిక, శారీరక వైకల్యాన్ని గుర్తిస్తే వారిని సత్వర చికిత్సా కేంద్రంలో పీడియాట్రీషియన్‌కు రిఫర్ చేస్తారు. వారిలో లోపాలను గుర్తించి వైద్య సేవలు అందిస్తారు. ఆపరేషన్ అవసరమైన వారిని ముందుగా ఒప్పందం కుదర్చుకున్న హాస్పిటల్‌కు తరలిస్తారు. దీంతో మానసిక, శారీరక వైకల్యంతో పుట్టిన పిల్లల విషయంలో తల్లిదండ్రుల ఆందోళనకు, ఆవేదనకు కొంత తెరపడినట్లే. చిన్నారుల్లో లోపాలను గుర్తించే క్రమంలో వారు ఒత్తిడికి గురికాకుండా ఆటపాటలలో నిమగ్నమయ్యేలా చేస్తారు. అందుకు సంబంధించి ఒక చిల్డ్రన్ పార్కు వాతావరణం కేద్రంలో ఉంది. కేంద్రంలో ఆగస్టులో రక్త హీనత కేసులు 16, స్కిన్ సంబంధిత సమస్యలున్న కేసులు 145, శ్వాసనాళాలకు సంబంధించినవి 333, దంత సమస్యలు 17, మానసిక ఎదుగుదల 18, పెరుగుదల సమస్యలు 15, డౌన్ సింద్రోమ్ 2, ఆలస్యంగా లేవటం, సమయాన్ని వృథా చేయటం వంటివి 17, ఇంకా ఇతర సమస్యలు కలిగిన కేసులు 29 గుర్తించినట్లు వైద్యుల గణాంకాలు చెబుతున్నాయి.

**సౌకర్యాలు మెరుగే.. సిబ్బందే కొరత..**

సౌకర్యాలు మెరుగ్గానే ఉన్నా సిబ్బంది కొరత ఉంది. వాస్తవానికి జిల్లా కేంద్రంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఉంటారు. ఆయన పరిధిలో తెనాలి, గుంటూరు డివిజన్ మేనేజర్లు ఉంటారు. వైద్య బృందం విషయానికి వస్తే పీడియాట్రీషియన్, మెడికల్ ఆఫీసర్, డెంటల్ ఆఫీసర్, చైల్డ్ సైకాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, ఆడియాలజిస్ట్, ఆప్టోమెట్రీషియన్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్ మొత్తం 16 మంది సిబ్బంది ఉండాలి. కాని జిల్లా కో-ఆర్డినేటర్ జిల్లా కేంద్రంలో ఉంటారు. మెడికల్ ఆఫీసర్, ఆడియాలజీ, ఆప్టోమెట్రీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీ. వీటిలో ఆడియాలజీ, ఆప్టోమెట్రీషియన్ కచ్చితంగా అందుబాటులో ఉండాల్సిందే. ఇక్కడి సిబ్బంది కొరతకు తోడు జిల్లా వైద్యశాలలో సిబ్బంది కొరత కారణంగా, ఇక్కడి సిబ్బంది ఓపీ సమయంలో జిజిహెచ్‌లో కూడా పనిచేయాల్సి వస్తోంది. ప్రభుత్వం సిబ్బంది కొరతను అధిగమిస్తే పేద పిల్లలకు మరింత మేలవుతుంది.

## బ్యాక్టీరియా నిర్ధారణపై శోధన

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని తెలియడంతో మట్టి నమూనాల పరీక్షలుచేశారు. ఇప్పటి వరకు గుంటూరు మెడికల్ కళాశాల, విజయవాడ, తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి, చెన్నై ఎస్‌ఆర్‌ఎం మెడికల్ కళాశాలలో నిర్వహించిన అనేక పరీక్షల్లో బ్యాక్టీరియా, వైరస్ నిర్ధారణ కాకపోవడంతో శని, ఆదివారాల్లో ఎయిమ్స్‌తో పాటు ఇతర వైద్య బృందాలు సేకరించిన రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపనున్నారు. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రమణ, డిఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు గ్రామంలో నాలుగు రోజులుగా పర్యటించి వివరాలు సేకరించారు.

**కొనసాగుతున్న సహాయ చర్యలు**

తురకపాలెంలో రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యారోగ్య శాఖ నిపుణుల పర్యవేక్షణలో నిరంతరం ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇంటింటికి ఆరోగ్యసర్వే నిర్వహించి, రక్త నమూనలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కేంద్ర వైద్యారోగ్యశాఖ నుంచి ఐఎఎస్ అధికారి ఆధ్వర్యంలో ఐసిఎంఆర్ నుంచి ఒక నిపుణుల బృందం మంగళవారం వస్తుందని తెలిపారు. 76 మంది సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నామన్నారు. 68 ఓవర్‌హెడ్ ట్యాంకులు, సిస్టర్న్లు శుభ్రపరిచారని, తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. శనివారం రాత్రి 2,609 మందికి భోజనం, ఆదివారం ఉదయం 3,378 మందికి అల్పాహారం, మధ్నాహ్నం 3,974 మందికి భోజనం అందించామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దన్నారు.



దాడిలో గాయపడిన శ్రీను

## పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్**

గొడ్డళ్లతో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన గంజెబోయిన శ్రీను, దుస్సామల్లి కార్జున్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలోని మసీదు సెంటర్లో ఇద్దరు గొడవ పడ్డారు. మల్లికార్జున్ అతని కుమారుడు క్రాంతి గొడ్డళ్లతో శ్రీనుపై దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనును కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ ద్వారా మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరవుపేటకు తరలించారు. శ్రీను భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేశారు.

## 87 మందికి రూ.6.40 లక్షల స్కాలర్‌షిప్ పంపిణీ

**ప్రజాశక్తి-పెదనందిపాడు** : పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని వాహనాల తనిఖీ అధికారి నంబూరు శివనాగేశ్వరరావు అన్నారు. 87 మంది విద్యార్థులకు పెదనందిపాడు ఎడ్యుకేషనల్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.6.40 లక్షల స్కాలర్‌షిప్‌ను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో శివనాగేశ్వరరావు మాట్లాడుతూ 14 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి విద్యార్థులకు తోడ్పాటు ఇస్తున్నట్లు చెప్పారు. యువత సోషల్ మీడియాని వీడి నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఉపకార వేతనాలు తీసుకున్నవారు జీవితంలో స్థిరపడిన వెంటనే మరొకరికి సహాయం చేయాలన్నారు. అధ్యక్ష కార్యదర్శులు డి.శేషగిరిరావు, ఎ.కృష్ణ, కోశాధికారి ఎం.రాఘవ య్య, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డి.రమేష్‌బాబు, డి.చంద్రశేఖర్, జి.రత్నం, కె.రమేష్ పాల్గొన్నారు.

## వైసిపిని వీడి టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - చేబ్రోలు** : మండంలోని వేజెండ్లకు చెందిన పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఎంపిటిసి కాసు అనితరెడ్డి, వార్డు సభ్యులు వేజండ్ల శశి కుమార్‌తోపాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు.

## దర్గా అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాశక్తి - పెదకాకాని** : మండల కేంద్రమైన పెదకాకానిలోని బాజీ బాబా దర్గాను ఆదివారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహమ్మద్ అలీ పరిశీలించారు. దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కాజా మస్తాన్‌కు అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు.

## ఆటక పరిచారని ఇద్దరిపై కేసు

**ప్రజాశక్తి - తెనాలి**

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇరువురు వ్యక్తులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కొలకలూరులో శనివారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల విధులక కోలంటి దాసు, సుద్ధపల్లి నవీన్ ఆటంకం కలిగించారు.విధులు నిర్వహిస్తున్న పోలీసుల ముందు మద్యం సీసాలను నడిరోడ్డు మీద పగలగొట్టి ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలిగించి, భయభ్రాంతులకు గురి చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఫుట్‌బోర్డు ప్రయాణం.. పోతున్న ప్రాణం..

### రైలు ప్రమాదాల్లో పెరుగుతోన్న మృతుల సంఖ్య

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రజల అవగాహన లోపం వల్ల నిత్యం రైలు ప్రయాణాలలో మరణాలు సంభవిస్తున్నాయి. 2022లో రైల్వేమంత్రిత్వ శాఖ జారీ చేసిన నివేదిక ప్రకారం రోజూ 57 మంది చొప్పున 20,972 మంది మరణించారు. అందులో ఎక్కువ మంది రైలుపెట్టె ఫుట్‌బోర్డు జారిపడి మరణించిన వారే అధికం. బుధవారం ఈ పరిసర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలో దుగ్గిరాల స్టేషనుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద వడ్లపూడి వద్ద రైలు నుంచి జారిపడి మరణించిన వ్యక్తి మృతదేహం గుర్తించారు. రెండుకిలోమీటర్ల దూరంలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి గాయపడిన వ్యక్తిని గుర్తించారు.

ఈ ప్రాంతంలో రైలు నుండి జారి పడుతున్న వారిలో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావటం విశేషం. వీరిలో ఎక్కువ మంది వలస కార్మికులు. బీహార్ చతీస్గడ్ ఝార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు కూలి నిమిత్తం చెన్నై వెళ్తుంటారు. వీరంతా సామాన్య భోగిలలో ప్రయాణిస్తుంటారు. జనరల్ భోగిలు, రిజ ర్వేషన్ బోగిల్లో సీటు లేక ఫుట్‌బోర్డు మెట్లపై కూర్చొని ప్రయాణిస్తుంటారు. సుదూర ప్రయాణం కాబట్టి ఒక్కోసారి రాత్రిపూట చల్లగాలికి నిద్ర వచ్చినపుడు లేదా బండి కుదుపులకు లోనైనపుడు జారీ కింద పడుతుంటారు. ఇలా పడిన వారిలో బతికి బట్ట కట్టిన వారు చాలా తక్కువ. గాయాల పాలై రక్తస్రావం జరిగి మరణించిన వారే ఎక్కువ. రైలు నుంచి జారి పోయిన వారు కీమెన్ గుర్తించే వరకు అక్కడే ఉంటారు. ప్రాణాలతో ఉంటే ఆసుపత్రికి, మరణిస్తే మార్చురీకి పంపించే బాధ్యత కీమెన్‌దే. మృతదేహాలు కుక్కలు పీక్కు తినకుండా జాగ్రత్తగా కాపలా కాయవలసి ఉంటుంది. ఈ కేసులను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీస్ సంయుక్తంగా విచారణ జరపవలసి ఉంటుంది. మృతదేహాలకు అంత్యక్రియలు జరపటానికి ప్రతి రైల్వే పోలీస్ స్టేషనుకు (శౌడ్స్) పేరుతో రూ.5వేలు కేటాయిస్తారు. అనాథ శవాలుగా కాకుండా అన్ని లాంఛనాలు సక్రమంగా జరిపి వీరికి అంత్యక్రియలు చేయవలసి ఉంటుంది. కానీ మరణించిన అనంతరం నాలుగు రోజులు వరకు మార్చురీ లో ఉంచి ఆ తర్వాత మున్సిపాలిటీ వారికి అప్ప చెప్తారు.



ఫుట్‌బోర్డుపై కూర్చుని ప్రయాణిస్తున్న యువకులు

ఇండియన్ రైల్వే యాక్ట్ సెక్షన్ 156 ప్రకారం ఫుట్ స్టెప్స్ (మెట్లు) పై కూర్చుని ప్రయాణం చేయడం నేరం. కానీ సుదూర ప్రయాణాలు చేసే పేదలు, సామాన్య ప్రజలు కూర్చోటానికి సీట్ దొరకనప్పుడు ప్రమాదమని తెలిసినా ఆ ప్రయాణం తప్పదు. ప్రభుత్వం దూరప్రాంత రైళ్లలో జనరల్ కంపార్టుమెంట్లు పెంచడం, ప్రయాణికులకు అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ యంత్రాంగం మెట్లపై కూర్చొని ప్రయాణించకుండా చర్యలు చేపట్టాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రైతుబండ్ల సంఖ్యను కూడా పెంచవలసి ఉంటుంది.

మద్యం సేవించి ప్రయాణం చేయడం, సెల్ఫోన్లు వాడటం వలన కూడా మెట్లపై కూర్చొని ప్రయాణించిన వారిలో మరణాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ఫలితం లేదని కొందరు అధికారులు తెలిపారు. రైల్వేగార్డు మాట్లాడుతూ ప్రకారం మెట్ల మీద కూర్చోవద్దంటే ప్రయాణికులు సీటు లేదు ఎక్కడ కూర్చోమంటారు అని తిరగబడ్డ సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. వీరి వల్ల తమకు బివి, షుగర్ కూడా పెరుగు తున్నాయనీ, ఎంత చెప్పినా వినరని వాపోయారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకున్నట్లయితే ప్రమాదాలు జరిగినప్పుడు రూ.10 లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ బీమా కోసం కేవలం 45 పైసలు మాత్రమే ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. సుదూర ప్రయాణాలు చేసే వారు ఈ బీమా తప్పనిసరిగా చేయించుకోవాలనీ, ఫుట్ బోర్డు మీద కూర్చోకుండా ప్రయాణం చేయడం అందరికీ క్షేమకరమని పేర్కొన్నారు.

## కారుమంచి ఘటనపై ప్రచారం అవాస్తవం

### రూరల్ సీఐ ప్రభాకర్

**ప్రజాశక్తి - వినుకొండ**

శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో విగ్నేశ్వర నిమజ్జన ఊరేగింపు వద్ద జరిగిన రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణను పోలీసులు సమర్థవంతంగా అడ్డుకొని అదుపు చేశారని వినుకొండ రూరల్ ప్రభాకర్ తెలిపారు. గ్రామంలో జరిగిన ఘర్షణలో ఒక గ్రూపుపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని చేస్తున్న ప్రచారం అవాస్తమన్నారు. ఈనెల 4వ తేదీ ఒక వర్గానికి చెందిన వారు గణేష్ విగ్రహం నిమజ్జనం ఊరేగింపు చేసుకుంటూ ఎన్టీఆర్ సెంటర్, సత్రం సెంటర్‌కు వెళ్ళగానే అదే సమయంలో రెండో గ్రూపునకు చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయన్నారు. ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా కొంతమంది ముద్దాయిలను ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసులు చట్టాన్ని అతిక్రమించి అక్రమ కేసులు పెట్టలేదని రెండు గ్రూపులు గొడవపడి కొట్టుకున్న వారి మీద కేసులు పెట్టారనీ, పోలీసులు ఎవరిని ఇబ్బంది పెట్టలేదని వివరించారు. సుదీర్ఘ కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న గుంటకల్ అనంతరావు ఆదివారం తెల్లవారుజామున చనిపోయారని తెలిపారు. తాము చట్ట ప్రకారమే నడుస్తున్నామని సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న ఆరోపణలు సరైనవి కాదని, అసత్య ప్రచారాలపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

### 50 గ్రాములు బంగారం, రూ.10 వేలు అవహరణ

**ప్రజాశక్తి - మేడికొండూరు**

తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు బంగారు వస్తువులు దొంగిలించిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. మేడికొండూరుకి చెందిన షేక్ మస్తాన్‌వలి తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కుబడి తీర్చుకునేందుకు నెల్లూరు జిల్లాకు శుక్రవారం వెళ్లారు. ఇంటికి ప్రధాన డోర్లకు తాళాలు వేసి వెళ్లారు. నెల్లూరు మొక్కుబడి ముగించుకుని శనివారం రాత్రికి మేడికొండూరు వచ్చారు. తలుపు తీసి లోపలికి వెళ్లేసరికి ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి, బీరువా పగలగొట్టి లాకర్లు తీసి ఉండడాన్ని గమనించారు. దొంగతనం జరిగిందని భావించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించగా కొన్ని డోర్లు, బీరువా పగలగొట్టి బీరువా లాకర్లు తెరిసి ఉన్నాయి. బీరువాలో ఉన్న 50 గ్రాములు మూల బంగారు ఆభరణాలుతోపాటు రూ.10వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. పోలీస్ దర్యాప్తులో భాగంగా వేలి ముద్రల నిపుణులను, డాగ్ స్క్వాడ్లను రంగం లోకి దింపి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



దుండగులు పగలగొట్టిన బీరువా

## గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

**ప్రజాశక్తి - మాచర్ల**



అజయ్ కుమార్

వినాయక నిమజ్జ నాని కి వెళ్లి సాగర్ కుడి కాలువ లో గల్లంతమైన యువకుడి మృతదేహం ఆదివారం బుగ్గవాగు రిజర్వాయర్‌లో లభ్యమైంది. స్థానిక పాత మాచర్లకు చెందిన సాఫ్వేర్ ఉద్యోగి ఆకుల అజయ్ కుమార్(30) శుక్రవారం వినాయకుని విగ్రహం వెంట నిమజ్జనానికి వెళ్లి సాగర్ కుడి కాల్వలో కాళ్లు చేతులు కడుక్కునేందుకు దిగి గల్లంతైెడు. అజయ్ కుమార్ మృతదేహం బుగ్గ వాగు రిజర్వాయర్‌లో లభ్యం కాగా మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని బంధు వులకు అప్పగించారు.

## ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**ప్రజాశక్తి - తెనాలి**

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై కె.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన పి. కోటేశ్వరరావు(40) ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ, అప్పుడప్పుడు వ్యవసాయ పనులకు వెళుతుంటాడు. అతనికి భార్య, ఇద్దరు కుమా రులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# కౌలురైతులకు గుర్తింపు కార్డులు దక్కేనా?

ప్రజాశక్తి - పెదకూరపాడు

అర్హులందరికీ కౌలు కార్డులు దక్కుతాయని సందేహం తలెత్తుతుంది. మండలంలో 20 గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలలో సొంత వ్యవసాయ భూమి అరకరం, ఎకరం, రెండెకరాలులోపు ఉన్నవారు ఎక్కువ ఉన్నారు. వీరంతా అదనంగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. 60శాతానికి పైగా కౌలుకు తీసుకొని సాగు చేసేవారు ఉన్నారు. ప్రభుత్వం మండలానికి 2429 కౌలు కార్డులు ఇవ్వాలని కనీస లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు కేవలం 1103 మాత్రమే ఇవ్వగలిగారు. మిగిలినవి పూర్తి చేయటానికి ఎంత కాలం పడుతుందో అంతుచిక్కని ప్రశ్నగా ఉన్నది. ప్రస్తుతం యూరియా కొరత వలన ఎకరానికి బస్తా రెండు బస్తాలు చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. ఇదే కౌలు కార్డు ఉంటే యూరియా అందరితోపాటు తీసుకునే పరిస్థితి ఉన్నది. కార్డు లేకపోవడం వల్ల ప్రవేటు వ్యాపారుల దయా దక్షిణాలపై ఆధార పడవలసి వస్తుంది. పంట ఉత్పత్తులు అమ్ముకోవటానికైనా కౌలుకార్డులు బహుళ ప్రయోజన కారి గా ఉన్నాయి. కార్డు లేని లేనివారు పండించిన పంటను ప్రైవేటు వారు ఇచ్చిన ధరకు తెగ అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. అధికారులు స్పందించి కౌలుకార్డులు మం జూరుకు ప్రథమ ప్రాధాన్య తేవాలని రైతులు కోరుతున్నారు.

**కౌలు కార్డు ఇవ్వడం లేదు నీలాంబరం**

మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన కౌలు రైతు నీలాంబరంకు కౌలు కార్డు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు కార్డు దరఖాస్తు చేసుకోవడానికి భూ యజమాని పాస్ పుస్తకము జిరాక్స్, అతను సంతకం చేయాలని చెబుతున్నారు. కానీ భూ యజమాని ఇవ్వటానికి సిద్ధంగా లేరు. అధికారులు మాత్రం పాస్ పుస్తకం తప్పనిసరిగా కావాలని కోరుతున్నారు. దీంతో కౌలు కార్డు రాని పరిస్థితి ఉందన్నారు. పంట వేశామా లేదా అని ప్రభుత్వ అధికారులు విచారించి కౌలు కార్డు ఇవ్వాల్సిందిగా కోరారు.

**షరతులు లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలి**



కౌలు రైతులకు ఎటువంటి షరతులు లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని పెదకూర పాడు నియోజకవర్గ నాయ కులు తిమ్మిశెట్టి హనుమంత రావు డిమాండ్ చేశారు. వ్యవ సాయశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు విచా రించి అర్హులందరికీ కార్డులు ఇవ్వాలన్నారు. కార్డు లేక పోతే చాలా నష్టం జరుగుతుందని వివరించారు. వెంటనే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి బాలాజీ గంగాధర్

## ఎరువుల కోసం ఆందోళన వద్దు

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలలోని పలు గ్రామాలలో గ్రామ రైతులకు వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ ఆదివారం యూరియా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూచనల మేరకు రైతులు యూరియాను ఎరువులను వాడుకోవాలని సూచించారు. రైతుల ఇళ్లకు కరపత్రాలను అంటించారు. ఎరువు లపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు కావలసినంత వరకే ఎరువులు ఉపయోగించుకోవాలని తెలియ చేశారు. మండలంలోని పలు గ్రామాల రైతులు అధికారుల సూచనల మేరకే ఎరువులు వాడుకోవాలని తెలిపారు. ఎరువుల కొరత లేదని కావలసినంత మేరకే ఉపయోగించుకోవాలని అన్నారు. ఎరువుల షాపు యజమానులు ఎమ్మార్పీ రేట్లు కంటే ఎక్కువగా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మ్యాపును పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

## బుద్ధిజం అకాడమీ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లో ఆదివారం భారతీయ ట్రస్ట్ సంస్థ పర్యటనలో భాగంగా గ్రామీణ వారసత్వం అభివద్ధి కోసం బుద్ధిజం అకాడమీ స్థాపన కొరకు 250 ఎకరాలను పరిశీలించారు. ఈ సంస్థ గ్రామీణ సంప్రదాయాలు సంస్కృతులు పరి రక్షించటంతో పాటు గ్రామీణ ప్రాంతాల స్థిరమైన ఆర్థిక అభివద్ధి కొరకు పాటుపడుతుంది. స్థానిక యువతకు కావాల్సిన నైపుణ్యం శిక్షణ కార్యక్రమం చేపడుతుంది. కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖకు సంబంధించి అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించారు. స్థల పరిశీలన చేసిన బందంలో రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ మల్లికార్జునరావు, గురజాల ఆర్డీవో మురళి, పర్యాటకశాఖ అధికారి నాయుడమ్మ, మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్, మండల సర్వేయర్, హరిత యూనిట్ ఇంచార్జ్ మస్తాన్‌రావు, నాగులవరం సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు బాలబాట ద్వారా విద్య

ప్రజాశక్తి-ముప్పాళ్ల

పేద ప్రజల పిల్లలకు బాలబాట ద్వారా ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని కార్డ్స్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గనికపూడి సుబ్బారావు అన్నారు. మండలంలోని కొంకావారి పాలెం ఎస్సీ కాలనీలోకార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ 25 యేళ్లుగా బాలబాట ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదవర్గాల వారికి ఉచిత చదువుతో పాటు పది రకాల కూరగాయ విత్తనాలు అందిస్తు న్నామని అవి మంచి ఎరువులతో పండించుకుంటే విషతుల్యం కాకుండా ఉంటాయన్నారు. బాలబాట ద్వారా గురుకుల పాఠశాలలకు, మోడల్ పాఠశాలలకు పిల్లల్ని పరీక్షలు రాయించి పిల్లలకు బాలబాట ద్వారా ప్రతి సంవత్సరం మోడల్ పేపర్ అందజేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. బాలబాట డెవలప్మెంట్ ఆర్గనైజర్ ఇర్ల కాశమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# 1100 సేవలను వినియోగించుకోండి : కలెక్టర్

## నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని కలెక్టర్ పి అరుణ్ బాబు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక...**

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందనీ, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్ తీసుకురావాలని సూచించారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సఅప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రస్తుత పంటల అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలనీ జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గా రావు అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో రైతుసేవా కేంద్రంలో ఆదివారం ఎరువుల పంపిణీని కార్య క్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.ఆయన మాట్లా డుతూ రైతులు ప్రస్తుత పంటలకు అవసరం మేరకే రసాయనిక ఎరువులు, యూరియా కొనుగోలు చేయాలన్నారు. యూరియా తీసుకున్న రైతులు అనవసరంగా ఇళ్లల్లో స్టాకు పెట్టుకోవద్దన్నారు. జిల్లాలో ఎక్కడ రసాయనిక ఎరువులు కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎరువులు తీసుకున్న రైతులందరికీ ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టంలో రియల్ టైంయాప్‌లో రైతుల వివరా లన్నీ అప్డేట్ చేయాలన్నారు. మండలంలోని ఎరువుల డీలర్స్ ఎవరైనా ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ ధరలకు అమ్మితే ఎరువుల చట్టం1985 క్రింద వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేస్తామనిహెచ్చరించారు రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట మండల వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి,వ్యవసాయ విస్తరణాధికారి బ్రహ్మయ్య, శేషుబాబు, అగ్రికల్చర్‌అసిస్టెంట్ ఫిలిప్ ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జగ్గారావు

# చికిత్స పొందుతున్న కౌలురైతుకు ఆర్థికసాయం చేయండి



నరసింహారావును పరామర్శిస్తున్న వెంకటనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పాము కాటుకు గురై సత్తెనపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిట్రగుంట నరసింహారావుకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని రైతు సంఘం నాయకులు బగ్గి వెంకట నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కందుల వారి పాలెం గ్రామానికి చెందిన బిట్రగుంట నరసింహారావు తండ్రి సూర్యనారాయణ శుక్రవారం పొలంలో నువ్వు వట్టెలు రాల్పు ఉండగా రక్తపింజరు పాము కాటేసింది. స్థానిక స్థానిక రైతులు వ్యవసాయ కూలీలు సంఘటన స్థలానికి చేరుకొని రక్తపింజరును చంపి నరసింహారావును సత్తెనపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన రెండు రోజుల నుండి చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు పెద్ద మొత్తంలో అవుతున్నాయనీ, భరించలేక పోతున్నామని నరసింహారావు కుటుంబ సభ్యులు వాపోయారు. విషయం తెలుసుకున్న రైతు సంఘం నాయకులు బగ్గి వెంకటనారాయణ చికిత్స పొందుతున్న నరసింహారావును సందర్శించి పరామర్శించారు. వెంకటనారాయణ మాట్లాడుతూ నరసింహ రావుకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిం చాలని, నరసింహారావు కోలుకునే వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కిలారి వెంకట్రావుకు సన్మానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట రంగస్థలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్టేషన్ రోడ్డులోని విజయ రెసిడెన్సి కాన్ఫరెన్స్ హాలులో నరస రావుపేట రంగస్థలి గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ ప్రిన్సిపల్ కిలారి వెంకట్రావు దంపతులను సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, స్వామి విద్యాసంస్థ అధినేత ఈఎం. స్వామి, రంగస్థలి అధ్యక్షులు షేక్. సుభాని, ఎంఏఎం కళాశాలల ఛైర్మన్ ఎం.రామశేషగిరిరావు పాల్గొని మాట్లాడారు. వెంకట్రావు విద్యా రంగంలో చేసిన కృషిని అభినందించారు. కిలారు వెంకట్రావు మాట్లాడుతూ నాటికలు ఒకప్పుడు సమాజానికి విజ్ఞానం, చైతన్యం నింపాయన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఉద్యమాలకు నాటికలు కొత్త ఊపిరి పోశాయన్నారు. కృష్ణవేణి విద్యాసంస్థల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కె. నాసరయ్య, రంగస్థలి సభ్యులుఎన్.బోస్, సూరిబాబు, జవ్వాజి వెంకట్రావు, ఏ.మధు కుమార్,షేక్‌పాషా, షేక్‌బాజీ, ఎం.ఆరోగ్యం చౌదరి పాల్గొన్నారు.

## వికలాంగులకు ఉచిత ఫిజియో థెరపి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

దివ్యాంగులను భావోద్వేగ మద్దతు, మానసిక ప్రోత్సాహ మిచ్చి ఆత్మావిశ్వాసాన్ని అందించటం ముఖ్యమని రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్ అన్నారు. ప్రపంచ ఫజియో దినోత్సవం సందర్భంగా రోటర్లీ క్లబ్ సహకారంతో స్థానిక డిఎన్ఆర్ ఫిజియో క్లినిక్ వారు మాచర్ల లోని సూర్యకిరణ్ దివ్యాంగుల పాఠశాలలో ఫిజియో థెరపి క్యాంపు నిర్వహించారు. అధ్యక్షులు తుమ్మల సత్య ప్రసాద్ మాట్లాడుతూ వారి అవసరాలకు అనుగుణంగా వారికి సహాయపడటానికి, వారికి స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం కలిగేలా చూడాలన్నారు. దివ్యాంగులను సమాజంలో సమానంగా చూడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఫిజయో థెరిపి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి వెంకట్రామయ్య, రొటీరియన్లు గోనుగుంట్ల రామ్మూర్తి, చెరుకూరి నరసింహారావు, పఠాన్ నాగురువలి, తిర్లిక శ్రీనివాసరావు, కోనేరు శంకర్, అన్నపురెడ్డి నాగార్జున రెడ్డి, జెవికెఎస్ ప్రసాద్, నరసింహరావు, కూరపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## వైద్య విద్యను వ్యాపారంగా మార్చిన జగన్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తన పాలనలో వైద్య విద్యను జగన్ వ్యాపార వస్తువుగా మార్చి మెడికల్ సీట్లు అమ్ముకున్నారని శాసన సభ్యులు ప్రత్తి పాటి పుల్లారావు ఆదివారం అన్నారు. స్థానిక పందరి పురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కళాశాలలు నిర్మిం చకుండా, వసతులు లేకుండా మొక్కు బడిగా ప్రారంభించి వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోవడానికి జగన్ ఆరాటపడ్డా రన్నారు. నిధులు ఇవ్వకుండా 17మెడికల్ కాలేజీలు తానే కట్టించినట్టు, రాష్ట్రానికి కొత్తగా వైద్య విద్యను పరిచయం చేసినట్టు దుష్ప్రచారం చేసుకోవడం జగన్ లాంటి అవకాశవాదికే చెల్లిందన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని వారు మెడికల్ కాలేజీలు కట్టారంటే ప్రజలు నమ్ముతారా? అన్నారు. జగన్ ఎగనామం పెట్టిన రూ.4,300 కోట్ల బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లిం చిందని తెలిపారు. కల్తీ మద్యంతో పేదల ఉసురు తీసిన పాపంజగన్ కుటుంబాన్ని వెంటాడుతుందన్నారు.

# ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

**సిఐటియు గుంటూరు జిల్లా నాయకులు వై.నేతాజీ**

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఆప్కాస్ రద్దును విరమించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు వై నేతాజీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఎం.టి.ఎం.సి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబి భవన్ లో తాడేపల్లి మండల మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల విస్తతస్థాయి సమావేశం సంగం మండల అధ్యక్షులు చొక్కా మరియ దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేతాజీ మాట్లాడుతూ వెట్టిచాకిరి చేస్తూ, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. పని ఎక్కువ ఉన్నచోట పారిశుద్ధ్య కార్మికులతో అదనపు పని చేయించకుండా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. పండుగ రోజులలో ఆఫ్ డే చేయించే విధానం మానుకోవాలన్నారు. అవసరమైన సెలవులు పారిశుద్ధ్య కార్మికులకు కల్పించాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా కనీస వేతనం 26 వేల రూపాయలు పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. గత ప్రభుత్వం వైసిపి, ప్రస్తుత ప్రభుత్వం టిడిపి ప్రభుత్వాల నిర్బంధాలను తట్టుకొని, పోరాట పటిమతో కార్మికుల పక్షాన నిలబడి, సిఐటియు పోరాట ఫలితంగానే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమకు రావలసిన హక్కులను సాధించుకున్నారని అన్నారు. 2023 సమ్మె అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన హెల్త్ అలవెన్స్ 6000 రూపాయలను ఇప్పటివరకు కార్మికులకు ఇవ్వకపోవడం అన్యాయమని, వెంటనే పెండింగ్ లో ఉన్న హెల్త్ అలవెన్స్ కార్మికులకు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర కార్మికులకు వలె ఎం బుక్ కార్మికులకు కూడా సమాన జీతభత్యాలు చెల్లించాలని సిఐజి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కఅష్ణ, తాడేపల్లి మండల పరిశుద్ధ కార్మికుల సంఘం మండల కార్యదర్శి మేకల డేవిడ్, కఅష్ణ తులసి, ప్రసన్నకుమార్, మరియమ్మ, ఉషారాణి, జయంతి, వెంకటేశ్వర్లు, జోజి బాబు, నూతక్కి సుధాకర్, నూతక్కి రాంబాబు, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.నేతాజీ



మాట్లాడుతున్న ఎ.వి.ఎన్.కుమారి

## అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడాలి

**ప్రజాశక్తి - ప్రత్తిపాడు**

సమ్మె కాలపు ఒప్పందాల అమలు కోసం అంగన్‌వాడీలు ఐక్యం పోరాడాలని ఎ.వి.ఎన్.కుమారి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్టు మహాసభ పి.ప్రేమలత అధ్యక్షతన ఆదివారం జరిగింది. సభలో జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ, జిల్లా అధ్యక్షులు ఏవీయన్. కుమారి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు జరిగిన పోరాటంలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలిచారని గుర్తుచేశారు. సమ్మె కాలంలో ఇచ్చిన ఒప్పందాలు అమలు చేసేందుకు నేతలు కఅషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాలు మారి సంవత్సరం పూర్తయినా వేతనాల పెంపు జరగలేదని, ఇతర సమస్యల పరిష్కారం కేవలం పోరాటాల ద్వారానే సాధ్యమైందని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు మాట్లాడుతూ "అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కేవలం నిరంతర పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని గత అనుభవాలు చెబుతున్నాయి" అన్నారు. తల్లికి వందనం, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు, వితంతు పెన్షన్ వంటి పథకాల అమలు ఇంకా జరగకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ల సమస్యపై పోరాటం చేసి 5జీ ఫోన్లు సాధించుకున్నామని గుర్తుచేశారు. నూతన ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా కె.పద్మ, కార్యదర్శిగా పి.ప్రేమలత, కోశాధికారిగా నగరాజకుమారి,ఉపాధ్యక్షులుగా సుభాషిణి, శివ పార్వతి, ధనలక్ష్మి, శ్రీవాసవి, నవరత్నమణి, సహాయ కార్యదర్శులుగా విజయ, శశికళ, శ్రీదేవి, నవనీతం, స్వాతి, మరో 15 మందితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.







నిడమర్రు, చిలువూరు గ్రామంలో నిరసన తెలుపుతున్న నాయకులు

## అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ నిరసనలు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

ట్రంప్ ప్రతీకార సుంకాలను వ్యతిరేకించాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజ్ అధ్యక్షతన నిడమర్రులో ఆదివారం నిరసన చేపట్టారు. రవి మాట్లాడుతూ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నారని నెపంతో భారత్ మీద ప్రతీకార శుంకాలు 50శాతం విధించామని ట్రంప్ చెప్పడాన్ని దేశభక్తి యుత భారత ప్రజలందరూ వ్యతిరేకించాలని అన్నారు. ట్రంపు చేస్తున్న బెదిరింపుల పై భారత ప్రధాని మోడీ నోరు విప్పి మాట్లాడాలని అన్నారు. పెంచిన ప్రతీకార శుంకాలను ఉపసంహరించుకోవాలని రవి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు గైరబోయిన నాగేశ్వరరావు కట్టే పోగు నాగేశ్వరరావు, కైలా స్టాలిన్ కట్టె పోగు బుల్లెబ్బాయి మంచికలపూడి కోటేశ్వరరావు కుంపటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిలువూరులో..**

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

మండలంలోని చిలువూరు గ్రామం అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం వామపక్ష పార్టీల, ఆధ్వర్యంలో భారతదేశ ఎగుమతులపై అమెరికా అధ్యక్షులు ట్రంప్ శుఖాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ అమెరికా వేసిన భారాలతో రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. దేశ ఆక్వాఉత్పత్తుల్లో 40 శాతం ఏపీ నుండి ఉంటాయని, రెండువేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఆత్పత్తులపై ఆ ప్రభావం ఘోరంగా పడుతుందని వివరించారు. వీసా నిబంధనల కట్టిన తరం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు కూడా ఆగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.జోజి, జి.బాలచంద్రుడు, ఎం.అంజయ్య, కె.కోటేశ్వరావు, శ్రీనివాస రావు, కాళేశ్వరావు, బి.రాజు, టి.రాఘవులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతాజీ

## సీతారాం ఏచూరికి ఘన నివాళులు

**ప్రజాశక్తి- తాడేపల్లి**

ఇటు ప్రజా బాహుళ్యంలో, అటు పార్లమెంట్ రంగంలో, కమ్యూనిస్టు ప్రమాణాలను పాటిస్తూ రాణించిన మేరు మగధీరుడు సీతారాం ఏచూరి అని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. ఆదివారం సుందరయ్య నగర్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ విద్యార్థి దశనుండే చదువులో మొదటి ర్యాంక్ విద్యార్థిగా రాణించి, రాజకీయ రంగంలో అదే వరవడిని కొనసాగించారని చెప్పారు. దేశంలో సిపిఎం బలోపేతానికి కృషి చేసిన అగ్రనాయకత్వంలో ఏచూరి పాత్ర మరిచిపోలేనిది అన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన చివరి వరకు పేదల హక్కుల కోసం పనిచేశారని కొనియాడారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నారి న నాగేశ్వరరావు, ఎస్ గిరిజ, ఎస్ వెంకటరావు, కె.గడ్డన్న, ఉష, బి.రామారావు, భాష, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో నిర్మిస్తున్న ఫోరెన్సిక్ ప్రయోగశాల

## ముస్తాబవుతోన్న ఫోరెన్సిక్ ప్రయోగశాల

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఫోరెన్సిక్ ప్రయోగశాల భవన నిర్మాణ పనులు వేగవంత మయ్యాయి. కెవిఆర్ జెడ్పి హైస్కూల్‌కు సమీపంలో ఆరు అంతస్తులతో రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ ప్రయోగశాల సుందరంగా ముస్తాబవుతోంది. నేరపరిశోధన, శాస్త్రీయ ఆధారాల విశ్లేషణకు, పోలీసుశాఖకు అత్యంత అవసరమైన ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. తుళ్లూరులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.258 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఫోరెన్సిక్ ప్రయోగశాలకు డిసెంబర్ 28, 2017న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భవనం నిర్మాణం పనులు కొంతమేర జరిగాయి. 2019లో జరిగిన ఎన్నికలలో వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రయోగశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో ఫోరెన్సిక్ ల్యాబ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. విమర్శలు వెల్లువెత్తడంతో పనులు తిరిగి మొదలు పెట్టినప్పటికీ మందకొడిగా సాగాయి. కొద్దిమంది కార్మికులతో తూతూ మంత్రంగా పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ప్రయోగశాల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. ప్రయోగశాల వ్యయం పెరిగిందని, అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు వేగవంతమయ్యాయని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు.నేర నిరూపణలో శాస్త్రీయ ఆధారాల విశ్లేషణకు ఫోరెన్సిక్ ప్రయోగశాల ఎంతో దోహదపడుతుంది.సైబర్, నార్కోటిక్,డిఎన్ఎ బయోమెట్రిక్, బాలిస్టిక్స్, ఆరు ఎక్స్‌లెన్స్ కేంద్రాలు, శిక్షణ, పరిశోధన అభివృద్ధి విభాగాల ఏర్పాటు, ఫోరెన్సిక్ డాక్యుమెంట్లు, టాక్సికాలజీ వంటి పలు ప్రయోగాలకు వెలుపడేలా నిర్మాణం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.ఎట్టకేలకు ఆదిశగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ఫోరెన్సిక్ ప్రయోగశాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.



మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

## ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - పెదకాకాని**

ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ కోరారు. మండల పరిధిలో వెనిగండ్ల గ్రామంలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం మండల అధ్యక్షులు కె.ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. శివాజీ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందని, దీంతో ఆటో కార్మికులకు ఉపాధి కొరవడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద 30వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాజా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన న్యాయ సంహిత డ్రైవర్లకు భారీ పెనాల్టీలు జైలు శిక్షలు బి.ఎన్.ఎస్106(1)&2 సెక్షన్లు రద్దు చేయాలని ఆటోలకు పట్టణ మండల కేంద్రాలలో పార్కింగ్ స్థలాలు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుల్ల యాకోబు, వెంకటరెడ్డి, షేక్ ఇస్మాయిల్, టి.సాంబయ్య, షేక్.బికారిసాహెబ్, యు.దుర్గారావు, పి.లింగయ్య, ఎల్.అప్పారావు, ఎం.శ్రీధర్ కుమార్ నాయక్, దుర్గాప్రసాద్, స్వామినాయక్, గోపికృష్ణ నాయక్, శ్రీను నాయక్, కోటేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

## అర్బన్ బ్యాంకు ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

**ప్రజాశక్తి - తెనాలి**

ది కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ ఘట్టం ఆదివారం 2 గంటలకు ముగిసింది. వాస్తవానికి రెండు వర్గాలు పోటీ పడాల్సిన పరిస్థితిలో ఈనెల 14న ఎన్నికల జరగాల్సి ఉంది. అయితే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో ఏకగ్రీవం దిశగా పావులు కదిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమిష్టి కృషితో కూటమి నిర్ణయించిన ప్యానల్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో పాలకవర్గం దాదాపు ఏకగ్రీవం అయినట్లే. అయితే స్క్రూటి ని తదితర ప్రక్రియ అనంతరం సోమవారం ఎన్నికల అధికారి కుర్రా వెంకటేశ్వరరావు ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

**నామినేషన్ల కోలాహలం...**

ది కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం ఎన్నిక దాదాపు ఏకగ్రీవమైన సంకేతాలు ఉన్న నేపథ్యంలో కూటమిలో నామినేషన్ల కోలాహలం కనిపించింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ కుదూస్, జాకీర్ హుస్సేన్, జొన్నాదుల మహేష్, జెట్టి రేణుక, గుమ్మడి రమేష్, సుంకర హరికృష్ణ, వీరవల్లి మురళి, కొనసాగాలి నాగభూషణం, జాస్తి సరళ, దివి అనిత, నన్నపనేని సింగారాలు, దివి అనిత, మల్లీశ్వరి, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిన్నెల్లి

## రైతు సమస్యలను పరిష్కరించండి

### వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి

ప్రజాశక్తి - మాచర్ల

అన్నదాతల పట్ల నిర్లక్ష్యంతో ఉన్న ఈ ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకు ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలి పారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల9వ తేదీన అన్నదాతపోరు పేరిట ఆందో ళనకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యం లో ఆదివారంరాత్రి స్థానిక వైయస్సార్ కార్యాలయంలో పల్నాడు జిల్లా వైఎస్‌ఆర్సిపి అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నదాత పోరువాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యకర్తల ఉద్దేశించి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ యూరియాకొరత గిట్టుబాటు ధరలేక రైతులు విలవిలాడుతున్న తెలుగుదేశం ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందనిపేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైసిపి పోరాడుతుందని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలియజేసి అనంతరం ఆర్డిఓకు వినతిపత్రం అందజేయ నున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, రైతు సంఘాల ప్రతి నిధులు పెద్దఎత్తున హాజరై అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిన్నెల్లి పిలుపునిచ్చారు. ముందుగా హైదరాబాద్ నుండి మాచర్లకు వస్తున్న పిన్నెల్లికి విజయ పురి సౌత్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో మాచర్లకు చేరుకొన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కార్యకర్తలు భుజాని కెత్తుకొని పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లారు. పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆదిత్య బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదిత్య బ్రాహ్మణ సేవాసమితి భవనంలో ఆదివారం తూబాటి లక్ష్మీ నారాయణ ప్రాంగణంలో విద్యాజ్యోతి పథకం కింద 12 మంది పేదబ్రాహ్మణ విద్యార్థులకు రూ.50వేలు ఉపకార వేతనా లను అందజేశారు. 5గురు ఉత్తమ ఉపాధ్యాయులు గురుపూ జోత్సవాన్ని నిర్వహించి సన్మానించారు వారిలో అబ్బ రాజునాగ వెంకటహనుమద్ ప్రసాదు, వెంకటఉషారాణి దంప తులు, లక్కరాజు రాములలితమోదకుమారి, అబ్బరాజు సీతా రామా రావు దంపతులు, సోమరాజు రంగారావు దంపతులు, శనగల రామకృష్ణ సాయిబాబు దంపతులు ఉన్నారు. ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితిఅధ్యక్షులు ఏకమారుతి రామశర్మ అధ్య క్షత వహించారు ముఖ్య అతిథులుగా నరసరావుపేట విశ్రాంత ప్రధాన అధ్యాపకులు జె.వి.సుబ్బారావు, సమితి గౌరవాధ్య క్షులు చల్లా విజయ్‌కుమార్, సమితిప్రధాన కార్యదర్శి చంద్ర మౌళి సభా కార్యక్రమం నిర్వహించారు. బిల్డింగ్ కమిటీ వైస్ చైర్మన్ అనురుద్ధ, తులసిరామ్, ప్రచార కార్యదర్శి ధూళిపాల శ్రీకాంత్, కోశాధికారి పావులూరి శేషగిరిరావు, కమిటీ సభ్యులు పవన్, రాళ్లబండి సాయికుమార్ గొల్లపూడిశాస్త్రి పాల్గొన్నారు.

## ఆలయం మూసివేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేశారు. పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల మహా నివేదన అనంతరం, గ్రహ ణం సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ద్వారాలను మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆలయ శుభ్రం చేసి ఉదయం 9 గం నుంచి భక్తులకు పున:దర్శ నం కల్పించడం జరుగుతుందని ఆలయ ఈఓ కె.చంద్రశేఖర్ తెలిపారు.

## పేదల వాడల్లో అభివృద్ధి పరుగులు

### కబ్జాకోరులపై ఉక్కుపాదం
### ఆక్రమణలపై సమగ్ర విచారణకు ఆదేశం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

మాచర్ల నియోజకవర్గంలోని పేదలవాడల్లో అభివృద్ధి ని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్ప ష్టం చేశారు. ఆదివారం వెల్దుర్తి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. నియోజకవర్గ అభివద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున నిధులు కేటాంచి, అధిక ప్రాధాన్యత ఇస్తున్నా రని వివరించారు. మాచర్ల మున్సిపాలిటీ సర్వతోముఖాభి వృద్ధి లక్ష్యంలో భాగంగా ముందస్తుగా రూ.5 కోట్లనిధులతో రోడ్లు ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమా వేశాలు ముగిసిన తరువాత మాచర్ల మండలం, మేకల గొం ది వద్ద జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1200 కోట్లతో నూతనంగా నిర్మించనున్న వాటర్‌గ్రిడ్ శంకుస్థాపన మహోత్సవం ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేతుల మీదు గా నిర్వహించి, పనులు ప్రారంభిస్తామని ఆయన వెల్లడిం చారు. విజయపురిసౌత్‌లో దాదాపు రూ.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**కబ్జాకోరులపై ఉక్కుపాదం**

దేవాలయ భూములను అక్రమించుకొని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేద ని హెచ్చరించారు. గడిచిన 15 సంవత్సరాలుగా నియో జక వర్గ పరిధిలో వందల ఎకరాల దేవాదాయ శాఖ భూములు కబ్జాలకు గురైయ్యాయని, కబ్జాకోరులపై ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. గతంలో జరిగిన అనేక భూకబ్జా లపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు తగున్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధు, పార్టీ సీనియర్ నాయకులు కజ్జం సైదయ్య, మద్దిగపు చినవెంకటరామిరెడ్డి, పాలువాయి గ్రామ సర్పంచ్ హనిమిరెడ్డి పాల్గొన్నారు.

## మత్స్యకారుల కాలనీల్లో అభివృద్ధి పనులు

### రూ.3.39 కోట్లతో మంజూరైన రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం నుంచి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మత్యకారుల కాలనీకి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి చొరవతో మహర్దశ పట్టనుంది. నూతన రహ దారుల నిర్మాణానికి రూ.3.39 కోట్లు మంజూరు అవగా ఆ రహదారులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ముందు గా ఎమ్మెల్యే స్థానిక మత్యకారుల కాలనీలో ప్రజలు, అధికా రులతో సమావేశం నిర్వహించారు. కాలనీలో కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఎమ్యెల్యే మాట్లాడుతూ లంకమోటు,సాగర్ క్యాంపు, డౌన్ మార్కెట్‌లో రూ.2.39 కోట్లతో నూతన సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీ పం నుంచి సాగర్ కుడికాలువ బయ్యారం వరకు రూ.కోటితో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొ న్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఎమ్యెల్యే తెలిపారు.మాచర్ల నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్ల య్య, మండల టీడీపీ అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీను, టీడీపీ అధ్యక్షుడు బొల్లావెంకటే శ్వర్లు, శేరెడ్డి గోపిరెడ్డి, జనసేన అధ్యక్షుడు రాహుల్, మత్స్యకారుల సం ఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, ఎరిపల్లి వెంక టేశ్వర్లు, సాతులూరికుమార్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చు : డాక్టర్ రమ్య

ప్రజాశక్తి - కారంపూడి

వాతావరణ మార్పులు, వర్షాకాల ప్రభావంతో కారం పూడి మండలంలో సీజనల్ ఫీవర్ కేసులు వచ్చే అవకాశం ఉన్నందున జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శరీరనొప్పులు, వాం తులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే ప్రజలు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయించాలని, మండల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ రమ్య సూచించారు. ఆమె మాట్లాడుతూ మామూలు జ్వరం చిన్నది అనుకోవద్దని పిల్లలు, వద్ధులు, గర్భిణీలు, షుగర్, బీపీ, ఆస్తమా వంటి సమస్యలతో బాధ పడుతున్న వారు చిన్న లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయ కూడదు. ఇంట్లోనే మందులు వేసుకోవడం కాకుండా ప్రభు త్వ ఆసుపత్రులను తక్షణమే సంప్రదించాలి. నీరు తప్పనిసరిగా మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలి. దోమల వలన డెంగీ, మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది కాబట్టి దోమతెరలు, మస్కిటో కాయిల్స్, లిక్విడ్ వేపర్‌లను ఉపయో గించాలని ఆమె తెలిపారు. సామాజిక దూరం పాటిస్తూ జ్వరం, దగ్గు ఉన్నవారు ఇతరులతో సన్నిహితంగా ఉండ కూడదు. మాస్కులు వాడాలని తెలియ జేశారు. ఎలాంటి జ్వరమైన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య సహాయం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రు లు తమ పిల్లల్లో చిన్న జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయ కూడదు. వైద్యసిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు" అని తెలిపారు. మండల ఆరోగ్యవిభాగం అధికారులు మాట్లాడుతూ జ్వరాలువ్యాప్తి చెందకుండా ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామ ఆరోగ్య కార్మికులు, ఆశావర్కర్లు ఇంటిం టికీ వెళ్లి ప్రజలకు సూచ నలు ఇస్తున్నారు. పరిశుభ్రత, పరిశీలన, వైద్య సలహాతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు అని చెప్పారు.

## సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ సంబరాలు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ సంబరాలు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం స్టేట్ కమిటీ కన్వీనర్ కలం కౌంటర్ రవి కన్వీనర్ల పిలుపుమేరకు నిర్వహించారు. వినుకొండ కాకతీయ ఇంచార్జ్ మల్లి కార్జున రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి, ప్రధాన కార్యదర్శి రెడ్డి నగేష్ బాబు, గౌరవ అధ్యక్షులు తాతా సత్యనారాయణ, కోశాధికారి పెండాల సురేష్ బాబు, వాసవి క్లబ్ సభ్యులు గజవల్లి పవన్, మండవ కిరణ్ , చిలంకూరి కోటేశ్వరరావు విలేక రులు యస్.నరసింహారావు, దేసు విద్యా సాగర్, దేవరశెట్టి శ్రీనివాసరావు, రెడ్డి నగేష్, దేవి శెట్టి శివ బాల కోటేశ్వరరావు, సన్నిధి వెంకట శ్రీనివాసరావు హాజరయ్యారు.

## పరిహారం కోసం రైతుల నిరసన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న హైవే, రోడ్డు విస్తరణ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించడంలో రోడ్ల అథారిటీ వారు ఆలస్యం చేస్తున్నారని పసుమర్రు బొప్పుడి గ్రామాల రైతులు నిరసిస్తూ చిలకలూరి పేట బైపాస్‌వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. బొప్పూడి, పసుమర్రు గ్రామాల రైతులు బైక్ ర్యాలీగా వచ్చి తమ నిర సనను వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నప్పటికీ, భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వింజనంపాడు వెళ్లేమార్గంలో రోడ్డు బైఠా యించి బైపాస్ పనులు చేపట్టేవారు వెంటనే తమకు న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. రావుసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం రైతువిభాగం నాయకులు గుర్రం నాగపూర్ణ చంద్రరావు, సోంబాబు, గుంటు కోటేశ్వరరావు, గుంటు హరిబాబు, నవతరంపార్టీ అధ్యక్షులు రావు సుబ్ర హ్మణ్యం, మహిళానాయకురాలు షేక్ షమ్మీ, బి.దానయ్య బత్తుల శివ, బొప్పూడి, పసుమర్రు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గ్రాండ్‌పేరెంట్స్‌ను సన్మానిస్తున్న చిన్నారులు

## ఘనంగా గ్రాండ్‌పేరెంట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఎన్‌ఆర్‌టి.రోడ్లోని జివి ఐఐటి పాఠశాలలో ఆదివారం "గ్రాండ్‌పేరెంట్స్ డే" వేడుకలు ఘనంగా జరి గాయి. వృద్ధాశ్రమాలకు సహాయం చేయటమే కాకుండా అసలు వృద్ధా శ్రమాలలో ఎందుకు ఉండవలసి వస్తోందని ఎవరికి వారు ప్రశ్నించు కోవాలని అన్నారు. వృద్ధులు తమ మనవడు, మనవరాళ్ళతో వారికున్న అనుబంధాన్ని పంచు కునే సమయంలో కొందరు భావోద్వేగానికి లోనవటం పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యకు మనవళ్ళు, మన వరాళ్ళు సాంప్ర దాయ బద్ధంగా వారి పాదాలకు నమస్కరించి, సన్మానించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పారేపల్లి ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్ ఉపాధ్యాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.




లబ్దిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

## పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

పేదల సంపూర్ణ ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 87 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా రూ. 81లక్షల, 97వేలు విలువ చేసే నగదు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి సంజీవినిల మారిందని పేర్కొన్నారు. కూటమిపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓబన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వడ్డెరలు

## దుర్గారావు నియామకం పట్ల వడ్డెర సంఘం హర్షం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణానికి చెందిన టిడిపి పట్టణ అధ్యక్షుడు కొమరా దుర్గారావును రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా పట్టణంలోని వడ్డెర సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. ఆదివారం కొత్త హాల్ సెంటర్లోని వడ్డె ఓబన్న విగ్రహానికి ఆ సంఘం నాయకులు పూలమాలేసి నివాళులర్పించి, సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ రెడ్డి, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొమర దుర్గారావు కు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింటం వలన ఈ ప్రాంత వడ్డెర సామాజిక వర్గానికి మేలు జరిగే అవకాశముందన్నారు. అనంతరం దుర్గారావును జనసేన నాయకులు బత్తుల బాబురావు, బిజెపి పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, టిడిపి సీని యర్ నాయకులు అనంతరాములు, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు.

# ఆదాయం కోట్లలో..! ఆహ్లాదం జీరో..!

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణం నుండి ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పనులు ఆదాయం వస్తుంది. ప్రజల నుండి వస్తున్న ఈ ఆదాయానికి తగ్గట్లు వారికి ఆహ్లాదం (పార్కులు) ఏమైనా అందుతుందా అంటే సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతుంది. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత తాడేపల్లి పట్టణం (అర్బన్) శర వేగంగా అభివృద్ధి చెందుతోంది. 22,017 అసెస్మెంట్ నెంబర్ల నుండి ఇంటి పన్ను రూపంలో సంవత్సరానికి 11 కోట్ల 20 లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమవుతుంది. బైపాస్ రోడ్డు ప్రాంతంలో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు నిర్మాణం అవుతున్నాయి. ఒక బిల్డింగ్ ప్లాన్ రూపంలోనే సంవత్సరానికి సుమారు 15 కోట్లు వసూలు అవుతున్నాయి. స్టాంప్ డ్యూటీ, సర్ చార్జీల కింద మరో 3 కోట్లు జమవుతుంది. కుళాయి పన్ను మరికొంత ఖజానాకు జమ పడుతుంది. ఇది గాక రూరల్ గ్రామాల్లో సంబంధించి ఇంటి పన్నుల రూపంలో 5 కోట్ల 83 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ప్రజల నుండి కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చుకుంటున్న ఎంటిఎంసి కార్పొరేషన్ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలమైందనే విమర్శ ఎదుర్కొంటుంది. కార్పొరేషన్ పరిధిలోని ఒక్క తాడేపల్లిలోనే జనాభా సుమారు 1.50 లక్షలకు చేరుకుంది. అర్బన్ ప్రాంతంలో మరో లక్ష జనాభా నివాసం ఉంటున్నారు. వీరందరికీ మౌలిక సౌకర్యాలు కల్పించడం ఎంటిఎంసి అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పట్టణ ప్రజలు సేద తీరటానికి ఒక్క గ్రీనరీ పార్కు తాడేపల్లిలో ముచ్చటైన కనిపించడం లేదు. సీనియర్ సిటిజన్స్ మరియు పట్టణ ప్రజలు నడవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్ కూడా ఎక్కడా ఆనవాళ్ళు కూడా లేని పరిస్థితి నెలకొని ఉంది. కనీసం సాయంత్రం వేళ కూర్చుంటానికి పార్కులు, బెంచీలు కూడా ఏర్పాటు చేయరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలువ కట్ల పక్కన పేదల ఇళు తొలగించి అప్పట్లో పార్కులు ఏర్పాటు చేశారు. ఆలనాపాలనా లేక దుర్భరంగా మారాయి. ప్రస్తుతం మందు బాబులకు అడ్డగా మారాయి. పార్కులు అని పేరు అయితే నామకరణం చేశారు కానీ కాల్వ పక్కన ఫెన్సింగ్ వేసి సరైన రక్షణ చర్యలు తీసుకోలేదు. కోట్ల రూపాయల ఆదాయం సమకూర్తున్న తాడేపల్లి అర్బన్ మరియు రూరల్ లో పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం ముందుకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.




తాడేపల్లిలోని పార్కుల దుస్థితి



నినాదాలు చేస్తున్న కార్మికులు

## 278వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 278 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఎల్.ఐ.సి (సిఐటియు) ఐదు జిల్లాల అధ్యక్షులు, గ్రంధి రామమోహనరావు, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, కె.ఆదినారాయణ, షేక్ సుభాని ప్రారంభించారు, దీక్షలలో బొందలపాటి నవనీతమ్మ, మొలక శారదా, దేరంగుల రమణమ్మ, తుపాకుల రమాదేవి, దేవరపల్లి అంకయ్య, ముసలా సాంబశివరావులు కూర్చున్నారు. కార్యక్రమంలో డి.మాణిక్యారావు, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు, వై.సుబ్బారావు, బాషా, ఎంగురవయ్య, డి.నాగేశ్వరావు, టి.దుర్గాభవాని పాల్గొన్నారు.



ఆదినారాయణను సన్మానిస్తున్న డిఈవో రేణుక

## ఆదినారాయణకు అభినందనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఉద్యమ కెరటం, అక్షర దీపం, స్నేహశీలి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, మండలంలోని నెక్కల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సిహెచ్.ఆదినారాయణను ఎంపిక చేయడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆదినారాయణకు యూటిఎఫ్ మండల శాఖ శుభాకాంక్షలు తెలిపింది. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు,మండల అధ్యక్షులు,పి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, గౌరవాధ్యక్షులు ఎ.కోటేశ్వర రావు, టి.ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎ.కళ్యాణ్, టి.పూర్ణచంద్రరావు, ఎం.ఈశ్వర్‌నాద్, ఎం.ఉమామహేశ్వరరావు, ఎండి ఖాసీం తదితరులు ఆదినారాయణను సన్మానించారు.

## చేనేతకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు 1000 కోట్ల రూపాయలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రత్నాలు చెరువులో చేనేత కార్మిక సంఘం పట్టణ తొమ్మిదవ మహాసభ జరిగింది. మహాసభకు జంజనం శివ భవన్ నారాయణ అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ పాలకులు అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాల వలన చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉందని అన్నారు. దీనివలన చేనేత కార్మికులు ఆకలి సావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారని అన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత పై జిఎస్టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు జరపాలని డిమాండ్ చేశారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు చెంగయ్య మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మంగళగిరి పట్టణ నూతన అధ్యక్షులుగా డోకుపర్తి రామారావు, ఉపాధ్యక్షులుగా గోలి దుర్గా ప్రసాద్, కార్యదర్శిగా సాదు నరసింహారావు, సహాయ కార్య దర్శిగా ఎం.శివచంద్రరావు, కమిటీ సభ్యులుగా జె.చంద్రమౌళి, కె.కుమారి, కె.మల్లికార్జునరావు, భవన్ నారాయణ, వై.నాగు, జె.రవి, టి.హేమసుందరరావు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న పి.బాలకృష్ణ



అన్నదానం చేస్తున్న రమేష్‌బాబు

## భక్తులకు అన్నదానం..

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శ్రీ రత్నగర్భ సిద్ధి గణపతి దేవాలయం వద్ద శివ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శివ భక్త బఅందం ప్రతినిధులు గుండా రామాంజనేయులు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, యడ్ల గురునాథం, ఆంజనేయ ప్రసాద్, కె.శ్రీనివాసరావు, అవ్వారు వెంకటేశ్వరరావు, పంచల శివన్నారాయణ, కుర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, చెప్పులు, ఇతర రక్షణ పరికరాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు నాయకులు బురగా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం కృష్ణ నగర్ కార్మికుల మచ్చుర్ పాయింట్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ కార్మికులకు గత 16 నెలలుగా కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వటం లేదని, సంబంధిత అధికారులు పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. మున్సిపల్ అధికారులు కలగజేసుకొని పారిశుద్ధ కార్మికుల రావాల్సిన కొబ్బరి నూనె, చెప్పులు, ఇతర రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో కార్మికులను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కామాక్షి, నాని, సతీషు, మేరీ, మరియమ్మ,కొండయ్య, సంతోషం, సీమోను, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కుంచనపల్లికి చెందిన అమ్మిశెట్టి రామారావు జ్ఞాపకార్థం, అమరావతి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వేణు నాదెళ్ల, సౌజన్య కేతినేని ఆధ్వర్యంలో ఆదివారం ఎంపియుపి పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటికి సంబంధించిన వివిధ రకాల జబ్బులు , శుక్లాల పరీక్ష ను వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు కౌతవరపు పూర్ణ మాట్లాడుతూ సుమారు 200 మందికి పైగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో తన తండ్రి పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామస్తుల సహకారంతో చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కౌతవరపు రాజేష్, మండ్రు విజయ్ కుమార్, ఆమ్మిశెట్టి సురేష్, అమ్మిశెట్టి శ్రీలక్ష్మి, అమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ

## నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునర్ నిర్మించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారిన నాగేశ్వరరావు, దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి సుందరయ్య నగర్ లో భవన నిర్మాణ కార్మిక ఏరియా సమావేశం ఆదివారం వలి నాగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డుని పునర్మించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 15వ తారీఖు నాడు చలో విజయవాడ కార్యక్రమానికి సుందరయ్య నగర్ లోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని కోరారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న క్లైమ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో బాలకృష్ణారెడ్డి, భద్రయ్య, తిరుపాలు, హజరత్, ఎం.దుర్గారావు, లింగమూర్తి, స్వామి, శేషగిరిరావు, మస్తాన్‌ఐరావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెదకాకాని

అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 చెక్కులను 4,40,497 /- రూపాయల మొత్తాన్ని పెదకాకాని మండలంలోని లబ్ధిదారులకు పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా నరేంద్రకుమార్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, విన్నకోట పూర్ణ శంకర్రావు కూటమి నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది, వాలంటీర్లు

## ప్రగతి నగర్‌లో ఉచిత కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక మహాత్మాగాంధీ ఇన్నర్ రింగురోడ్డులోని ప్రగతి నగరలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 20 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉందని వైద్యులు గుర్తించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నలిన్, డాక్టర్ అపర్ణ వైద్యం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కె.శ్రీనివాసరావు, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ శంకర్ కంటి ఆసుపత్రి వారు పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించటం అభినందనీయమని అన్నారు. అనేక ప్రాంతాలలో క్యాంపులు నిర్వహించి, పేదలకు శస్త్రచికిత్స చేయటంలో ముందున్నారని అన్నారు. శస్త్ర చికిత్సలు చేయటంతోపాటు, పేషెంట్లకు రవాణా సదుపాయం కల్పిస్తున్నారని, ఇలాంటి సేవలు అందించేవారు సమాజంలో అరుదుగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి రవికుమార్, శంకర కంటి ఆసుపత్రి బీందం, సిఐటియు నాయకులు బి.ముత్యాలరావు, ఓ.పాములు, బి.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలకు పరిశీలిస్తున్న డీఆర్ఓ

## ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం గుంటూరులోని వివిధ పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలి పరిశీలించారు. ఉదయం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఏసి కళాశాల, టీజేపీఎస్ కాలేజీ, విజ్ఞాన్ నిరూల డిగ్రీ అండ్ పీజీ కాలేజీలోని పరీక్షా కేంద్రాల్లో జరిగిన స్క్రీనింగ్ పరీక్షలను డిఆర్ఓ పరిశీలించారు. ఉదయం పరీక్షలకు 7,655 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 5,988 మంది అభ్యర్థులు హాజరవగా, 1,667 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు మొత్తంగా 78.2శాతం నమోదైనట్లు తెలిపారు. మధ్యాహ్నం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 1,492 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1,133 మంది అభ్యర్థులు హాజరైనారు. 359 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లైజను అధికారులు , ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## సుమేధ ఉపాధ్యాయులకు అవార్డులు

ప్రజాశక్తి - గుంటూరు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో స్కూల్ డైరెక్టర్

స్థానిక ఎన్‌జిఒ కాలనీలోని సుమేధ హై స్కూల్ ఉపాధ్యా యులు కంతేరులోని విశ్వ శాంతి స్కూల్లో అప్పుసం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్య లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్స వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నట్లు హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖం రెడ్డి ఆదివారం తెలిపారు. హైయర్ ఎడ్యుకేషన్ నుంచి కె.అరుణ్‌కుమార్, ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో కృష్ణవేణి టీచర్ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. స్కూల్‌డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు బెస్ట్‌టీచర్ అవార్డులు రావటం అభినందనీయం అన్నారు.

# తల్లులు, శిశువులకు సకాలంలో వ్యాక్సిన్లు

### 10 రకాల వ్యాక్సిన్‌లతో 11 రకాల జబ్బులకు దూరం - జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌కుమార్






ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో మాతా శిశుసంరక్షణలో భాగంగా రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేస్తున్నట్టు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.శ్రావణ్‌కుమార్ తెలిపారు. గర్భిణులు డెలివరికి ముందు ధనుర్వాతం రాకుండా రెండు సార్లు వ్యాక్సిన్‌లు ఇస్తామన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, గుంటూరు, తెనాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సమయంలో తల్లులు, శిశువులకు ఇమ్యూనైజేషన్ చేస్తున్నట్టు తెలిపారు. శిశువులకు మొత్తం 10 రకాల వ్యాక్సిన్‌లు అందించి 11 రకాల జబ్బులు రాకుండా చూస్తున్నామని తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

**పిల్లలకు ఏ వయస్సు నుంచి ఏ వయస్సు వరకు వ్యాక్సిలు ఇవ్వాలి?**

పుట్టిన వెంటనే ప్రారంభించిన వ్యాక్సిన్ డోసులు 16 ఏళ్ల వరకు కొనసాగిస్తాం. శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఎటువంటి వ్యాధులు సంభవించకుండా పుట్టిన రోజు నుంచి ప్రారంభించి ఐదేళ్ల వరకు ఒక షెడ్యూలు ప్రకారం వ్యాక్సిన్‌లు ఇస్తాం. తరువాత 10 ఏళ్లకు, 16 ఏళ్ల వరకు వ్యాక్సిన్‌లు కొనసాగిస్తాం. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలీయో వ్యాక్సిన్ అన్నింటి కన్నా కీలకం అంతేగాక అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేస్తాం. శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆశా, అంగన్వాడీ, పారా మెడికల్ సిబ్బంది ద్వారా తల్లిదండ్రులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు అనారోగ్య లక్షణాలు గుర్తించి నివారించేందుకు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేలు చేస్తుంటారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు టీకాలు ఇస్తున్నాం.

**చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ?**

జిల్లాలోని అంగన్వాడి సెంటర్లు, ఇతర వైద్య కేంద్రాలలో తల్లులు, చిన్నారులకు ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నాం. వారి ఆరోగ్య వివరాలను కూడా వైద్య ఆరోగ్యశాఖ నిర్దేశించిన యాప్‌లో నమోదు చేస్తున్నాం. నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ఇంటింటికి వెళ్లి ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, ఎఎన్‌ఎంలు ఆరోగ్య పరీక్షల కిట్లను ఉపయోగించి ఏవైనా అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్లి అప్రమత్తం చేస్తారు. చిన్నారుల్లో నుమోనియా, ఇతర శ్వాసకోశ సంబంధ వ్యాధుల లక్షణాలను గుర్తించి తగిన చికిత్సలు చేయిస్తాం.

**ఏయే వ్యాక్సిన్‌లు ఎక్కువగా ఇస్తారు?**

చిన్నారుల్లో ప్రధానంగా పోలియో, డిఫ్తీరియా, దనుర్వాతం, మీజిల్స్ రూబెల్లా వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా టీకాలు పంపిణీ చేస్తున్నాం. మల్టీ విటమిన్ సిరప్‌లను 9 నెలల చిన్నారుల నుండి ఐదేళ్ల చిన్నారుల వరకు ఆరు నెలలకు ఒకసారి ఇస్తున్నాం. ఆరు నుండి పదేళ్లలోపు పిల్లలకు రక్త హీనత నివారణకు ఐరన్ టాబ్లెట్లు, కోరింత దగ్గు నివారణకు వ్యాక్సిన్లు ఇస్తున్నాం. గర్భిణులకు ఇంజెక్షన్లు చేస్తున్నాం. చిన్నారుల్లో ఎదుగుదల, పౌష్టికాహార లోపాన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలిస్తాం.

**గర్భిణులకు అందిస్తున్న వ్యాక్సిన్‌లు?**

హైరిస్క్ గర్భిణులను ప్రసవ తేదీకి ముందుగానే నిర్దేశించిన ఆసుపత్రిలో చేర్పిస్తే అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంతో ఎప్పటికప్పుడు తగిన వ్యాక్సిన్‌లు ఇస్తున్నాం. వైద్యారోగ్య శాఖ పంపిణీ చేస్తున్న విటమిన్ టాబ్లెట్లు, షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాల నిర్వహణ కొనసాగిస్తున్నాం.

# శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాటుపడాలి

ప్రజాశక్తి - మంగళగిరి






మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులను సన్మానించిన మాజీ లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు

శాస్త్రీయ సమాజం కొరకు ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఎస్ ఎల్ ఎం చైతన్య హై స్కూల్లో జన విజ్ఞాన వేదిక జిల్లా 18వ మహాసభ జరిగింది. మహాసభకు జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకా లను వ్యతిరేకిస్తూ శాస్త్రీయదృక్పథంతో సమాజం ఉండాలని లక్ష్యంతో 37 సంవత్సరాల క్రితం జన విజ్ఞాన వేదిక ఏర్పడిందని అన్నారు. రాజ్యాంగంలో ఉన్న అంశాలను ప్రస్తుతం రక్షించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది అని అన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలను కూడా మార్చి వేస్తున్నారని అన్నారు. అశాస్త్రీయ భావాలను ప్రభుత్వం అమలు చేస్తున్న తరుణంలో జన విజ్ఞాన వేదిక ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మౌలానా అబ్దుల్ కలాం పేరును ఇటీవల పాఠ్యపుస్తకాల్లో తొలగిం చడం అన్యాయ మన్నారు. జన విజ్ఞాన వేదిక ఉద్యమానికి గుంటూరులో గొప్ప చరిత్ర ఉందని అన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలు పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. శాస్త్రీయ ఆలోచన కార్యక్రమాన్ని ఆటంకపరిచే శక్తులు, అడ్డుకునే శక్తులు, సామాజిక వ్యవస్థలో ఉన్నాయని అన్నారు. ప్రముఖ వైద్యులు ఏవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో జరుగు తున్న రుగ్మతలకు వ్యతిరేకంగా శాస్త్రీయ ఆలోచనలను ప్రజల్లో పెంపొందించడానికి పనిచేయాలని కోరారు. భారతదేశ వ్యాప్తంగా 30 వేల మంది విద్యార్థులు ఒత్తిడి గురై చనిపోయారని అన్నారు. ఇలాంటి విషయా లలో శాస్త్రీయంగా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఏఐపిఎస్ఎన్ నాయ కులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజ లలో శాస్త్రీయ ఆలోచన ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మహా సభలో ప్రొఫెసర్ వేణుగోపాల్, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.వి.ఎస్. సాయి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.వి.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, రాష్ట్ర నాయకులు డి.బుజ్జిబాబు, అహమ్మద్ హుస్సేన్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఎస్-ఎల్ఎం చైతన్య హైస్కూల్ డైరెక్టర్ ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

కాగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులు టి.ఆంజనేయులు, సిహెచ్.ఆదినారాయణ, ఎస్.శ్రీనివాసరావులను మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు ఘనంగా సత్కరించారు.

**జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఎన్నిక**

మహాసభలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు గా కె.ఎస్.లక్ష్మణరావు, టి.రత్నారావు, డాక్టర్ ఎ.ఎస్.వి.ఎన్. ప్రసాద్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, అధ్యక్షులుగా ఎం. ఉదయభాస్కర్, ఉపాధ్యక్షులుగా బి.ప్రసాద్, టి.ఆర్.రమేష్, ఆర్.స్వాతి, షేక్ అహ్మద్ హుస్సేన్, కోశాధికారిగా జి.వెంకట రామా రావు, ప్రధాన కార్యదర్శిగా టి.జాన్ బాబు, కార్యదర్శులుగా రాము, వి. ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, టి.భాస్కరరావు, అనిల్ కుమార్, గోకుల్ చంద్ ఎన్నికయ్యారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమాలు

- భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా మహాసభ
- నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా






సంఘం నూతన కమిటీ, సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రతినిధులు

కార్మికుల హక్కుల సాధనలకు కృషి చేచేస్తామని పల్నాడు జిల్లా పల్నాడు భవన - ఇతర నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు తెలిపారు. పల్నాడు జిల్లా పల్నాడు భవన - ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) మూడవ జిల్లా మహాసభ కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ సయ్యద్ సైదా ప్రాంగణంలో ఆదివారం జరిగింది. సంఘం నాయకులు అవ్వారు ప్రసాదరావు, కొమ్ముల సురేష్, బత్తుల కొండలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు, భవన నిర్మాణ కార్మిక సంఘం జండాలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు ఆవిష్కరించారు. సైదా, అచ్యుతానందన్ చిత్రపటాలకు ఆంజనేయులు నాయక్, అంగలకుదురు ఆంజనేయులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఆంజనేయు లు నాయక్ మాట్లాడుతూ కార్మిక వర్గం హక్కులను కాపాడుకునేందుకు సంఘం కృషి చేయాలన్నారు. డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలన్నారు. భవిష్యత్తు కర్తవ్యాలను సంఘం ప్రధాన కార్యదర్శి సిలార్ మసూర్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. 15 మండలాల నుంచి మహాసభకు వచ్చిన జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి బృందం కార్యదర్శి నివేదికపై చర్చల్లో పాల్గని అనంతరం కార్యదర్శి నివేదికను ఆమోదించారు. అనంతరం 42 మంది సభ్యులతో పల్నాడు జిల్లా సంఘం నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇందులో నుంచి 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు, అధ్యక్షులుగా కోట ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా కొమ్ముల సురేష్, చిలక చిన్న యేసయ్య, కె.శేషు దాసు, ప్రధాన కార్యదర్శిగా షేక్ సిలార్ మసూద్, సహాయ కార్యదర్శిలుగా అంగలకుదురు ఆంజనేయులు, బత్తుల కొండలు, గొట్టిపాటి సాల్మన్ రాజు, బత్తుల బాలకోటయ్య, కోశాధికారిగా రామిశెట్టి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి డి శివకుమారి మాట్లాడారు.